విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

విద్యార్థిని కుటుంబ సభ్యులు పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్ 23: మండల పరిధిలోని బూచినెల్లి శివారులోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రమాదవశాత్తు రైలింగ్ మెట్లపై నుంచి జారి కింద పడి మృతిచెందిన సాదియా మెహరీన్ అనే విద్యార్థిని కుటుంబ సభ్యులను ఆదివారం రాత్రి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనవెంట రైల్వే బోర్డు మెంబర్ షేక్‌ఫరీద్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఎమ్మెల్యే పరామర్శ

కోహీర్, డిసెంబర్ 23: కోహీర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సోమవారం కోహీర్‌లోని అతడి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట శివకుమార్, నర్సింహులు, తట్టునారాయణ, వజయ్‌కుమార్, వెంకటేశ నర్సింహా గౌడ్, కలీం, సంపత్ ఉన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

విద్యార్థిని అక్షయను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, డిసెంబర్: రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడాపోటీల్లో లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌కు చెందిన విద్యార్థిని అక్షయను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మా ణిక్‌రావు సన్మానించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో కోహీర్ మాజీ ఎంపీటీసీ సంపత్ కుమార్తె అక్షయను అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగే క్రీడాల్లో రాణించి మంచి పేరుతోపాటు అవార్డులను సాధించేలా కృషి చేయాలన్నారు.

క్రిస్మస్ విందుకు స్పందన కరువు

నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ విందుకు ప్రజలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వట్‌పల్లి, డిసెంబర్ 23: కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ విందుకు స్పందన కరువైంది. మండల పరిధిలోని వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ విందు కార్యక్రమం సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయి కార్యక్రమానికి వంద మంది కూడా హాజరు కాలేదు. ప్రజల రాక కోసం అధికారులు ఎంత ఎదురుచూసినా ఎవరూ రాకపోడంతో ఉన్నవారితో కార్యక్రమం కొనసాగించారు. నియోజకవర్గ స్థాయి కార్యక్రమం గ్రామస్థాయి కార్యక్రమంగా దర్శనమిచ్చింది. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు వేలాదిగా తరలివచ్చిన జనం ప్రస్తుత వేడుకలకు వచ్చేందుకు ఎందుకు మక్కువ చూపడం లేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం, డిసెంబర్ 23: వార్డుల్లో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు చర్చి బస్తీ, 19వ వార్డు పోచమ్మ బస్తీలోల సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు చైర్‌పర్సన్ స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధులతో వార్డుల అభివృద్ధికి శరవేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు హనుమంత్ రెడ్డి, బీరప్ప యాదవ్, ప్రభునాయక్, ఏఈ కిష్టయ్య, నాయకులు జైపాల్‌రెడ్డి, స్థానికులు సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాలనీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

జహీరాబాద్, డిసెంబర్ 23: జహీరాబాద్ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. డిపో పరిధిలోని పీపడ్‌పల్లికి నైట్ ఆల్ట్ బస్సును నడిపించాలని స్థానికుడు కోరాడని పేర్కొన్నారు. మొగుడంపల్లి, గుడుపల్లి గ్రామాలకు బస్సును నడిపించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరినట్లు చెప్పారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో వచ్చిన ప్రజలను గుర్తించి, ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సెయింట్ ఆంథోనీస్‌లో సెమీ క్రిస్మస్



సంగారెడ్డి, డిసెంబర్ 23: సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో సోమవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్లు ఇన్నారెడ్డి, జోసెఫ్, సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత పాపులమ్మ సలోమాన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాల రెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ అరుణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఏసు వృజీవిత వృత్తాంతం నాటకం ఆకట్టుకుంది.

వైభవంగా అనఘా దత్త వ్రత మహోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: అనఘా దత్త వ్రత మహోత్సవం సోమవారం మండల పరిధిలోని ఫసల్వాదీలోని జ్యోతిర్వాస్తు విద్యా పీఠంలో వైభవంగా జరిగింది. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు, డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన వ్రత క్రతువులో 215 గ్రామాల నుంచి 2,400 మంది మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు ఆయా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనఘా దత్త వ్రత మహోత్సవం గురించి భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివపంచాక్షరి నామాన్ని జపించడంతో ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో మార్మోగింది. విద్యా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

గుమ్మడిదల: రైతులను సన్మానిస్తున్న రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి

జహీరాబాద్: రైతులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న వ్యవసాయాధికారులు

గుమ్మడిదల, డిసెంబర్ 23: వ్యవసాయం దండుగ కాదు పండుగ అనే రోజులు వచ్చాయని తహసీల్దార్ గంగాభవాని అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు పోచుగారి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఉమాదేవి, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఉద్యానవన శాఖ అధికారి అనూషారెడ్డి, పశుసంవర్ధక శాఖ మండల వైద్యాధికారి అపర్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జాతీయ రైతు సమాఖ్య మాజీ అధ్యక్షుడు మంద బలరాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ చిత్రపటానికి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వానకాలం సిజన్‌లో అధిక దిగుబడి సాధించిన రైతులను, మహిళా రైతులను ఉత్తమ రైతులుగా గుర్తించి సన్మానించి అవార్డులు అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా రైతు దినోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతురుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి, నాయకులు మద్దుల బాల్‌రెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, సదానందరెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, తులసీదాస్, పుట్ట నర్సింగ్‌రావు, పద్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేలను నమ్మిన రైతుల కృషి ఎనలేనిది

జహీరాబాద్, డిసెంబర్ 23: నేలను నమ్ముకొని, ప్రతికూల పరిస్థితులను తట్టుకొని శ్రమిస్తూ పంటలు పండించి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించే రైతుల కృషి ఎనలేనిదని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని రంజోల్ గ్రామంలోని రైతు వేదికలో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కేక్ కట్ చేసి తినిపించి శుభాకాంక్షలను తెలిపారు. పంటల సాగు చేసేటప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు పాటించాలన్నారు. పంటలకు ఆశించే తెగుళ్లు, చీడపురుగలను సకాలంలోఏ నివారణ చర్యలు తీసుకుంటేనే అధిక దిగుబడిని సాధించవచ్చాన్నారు. అనంతరం చెరుకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు, కలుపు, చీడపురుగులు, తెగుళ్లను నివారించే చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు, రైతు వేదిక పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

దొంగిలిచబడిన బంగారు నగలను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. రూ.18 లక్షల విలువైన 24 తులాల బంగారం, టీవీ స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ సోమవారం వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం జన్నారం గ్రామానికి చెందిన ముద్దంగి భీమేశ్ హైదరాబాద్‌లోని నాంపల్లి లేబర్ అడ్డా వద్ద నివాసం ఉంటున్నాడు. కొన్నేండ్లుగా హైదారాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని రాత్రి దొంగతనాలకు పాల్పుతున్నాడు. అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం అమీన్‌పూర్, బీఆర్ఎస్ కాలనీలో అనుమానస్పదంగా తిరుగుతున్న నింధితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అన్ని నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. దొంగను పట్టుకున్న పోలీసు సిబ్బందిని అభినందికి రివార్డు అందించనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు సదా నాగరాజు, శివకుమార్, శ్రీకాంత్, ఎస్సై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు విజయ్‌కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: వినియోగదారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, వాణిజ్య శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'వినియోగదారులు – రక్షణ చట్టాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయ్‌కుమార్ వినియోగదారుల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రూ.5 లక్షల లోపు వస్తువులకు సంబంధించిన వినియోగదారులు మోసపోతే జిల్లా వినియోగదారుల సంఘాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విజయ సారథి, అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ కూణవేణు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయ భూములను కాపాడాలి

జిన్నారం తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బొల్లారం, డిసెంబర్ 23: జిన్నారం మండల కేంద్రంలోని తాంబేలు గుట్టపై శివాలయ భూములను కాపాడాలని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని శివాలయం భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని వాపోయారు. ఆలయ భూములను వెంటనే సర్వే చేయించి, కాపాడాలని కోరారు. సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తోళ్ల కార్ఖానా మిగులు స్థలాన్ని కాపాడాలి

బొల్లారం, డిసెంబర్ 23: జిన్నారం మండలం శివనగర్‌లోని తోళ్ల కార్ఖానాకు కేటాంచిన స్థలం అన్యాక్రాంతానికి గురవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలోని 114 సర్వే నంబర్‌లో 20 ఏండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తోళ్ల కార్ఖానా ఏర్పాటుకు 13 ఎకరాలు కేటాయించిందని, ఒక్కో దానికి 290 గజాల చొప్పున స్థలం కేటాయించినట్లు పేర్కొన్నారు. అందులో కొన్ని ఏర్పాటు కాగా మిగిలిన స్థలాన్ని కొందరు ఆక్రమించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఖాళీ స్థలంలో గృహ నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మళ్లీ నిర్మాణాలకు తెరలేపారని రెవెన్యూ అధికారులకు వివరించారు. మిగులు స్థలంతోపాటు మరో 20 ఎకరాలు సేకరించి గ్రామంలోని పేదలకు కేటాయించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి, వినోద్, రాజు, వెంకటేశ్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్టు షాపులను నియంత్రించాలి

జోగిపేట ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అందోల్, డిసెంబర్ 23: గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపులను నియంత్రించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అందోల్ మల్లేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జోగిపేటలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించి బెల్టు షాపులను నియంత్రించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడచూసినా మద్యం ఏరులై పారుతున్నదన్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి ఫలితం లేదని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి బెల్టుషాప్‌లపై చర్యలు తీసుకోకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ప్రసాద్, గోపాల్, మహేశ్, చెట్టయ్య, దుర్గయ్య, యాదయ్య, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

బస్సుల కోసం మహిళల ఎదురుచూపులు

కోహీర్, డిసెంబర్ 23: ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం సాయంత్రం మూడుగంటల నుంచి నాలుగు గంటల వరకు జహీరాబాద్ వైపునకు వెళ్లేందుకు ఒక్క ఆర్టీసీ బస్సు రాలేదు. దీంతో కవేలి, కోహీర్, వెంకటాపూర్, చింతల్‌ఘాట్, తదితర గ్రామాల మహిళలు బస్సుల కోసం పడిగాపులుకాశారు. అత్యవసర పరిస్థితి ఉంటే సకాలంలో ఇండ్లకు ఎలా చేరుకుంటామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో జహీరాబాద్ వైపునకు వంతెనపై నుంచి నాలుగు డీలక్స్ బస్సులు వెళ్లడం విశేషం. కొంతమంది బస్సుల కోసం చూసి ఆటోల్లో వెళ్లిపోయారు. ఆర్టీసీ మేనేజర్‌ను వివరణ కోరగా, సమయానుకూలంగా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నల్లూరును కొత్త మున్సిపాలిటీలో కలుపాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం ఇస్తున్న నల్లూరు గ్రామస్తులు

బొల్లారం, డిసెంబర్ 23: జిన్నారం మండలంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గడ్డపోతారం మున్సిపాలిటీలో నల్లూరు గ్రామాన్ని సైతం కలుపాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీని గడ్డపోతారం మున్సిపాలిటీలో కలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా గ్రామాల అభివృద్ధి వే గంగా జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యకు పునాది

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 23: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంపూర్ణ విద్యకు పునాది వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలో ఐసీడీఎస్ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్యా తరంగిణి టీచర్స్ మేళాకు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన నృత్య రూపకాలు, కథలు చెప్పడం, అక్షరాస్యత కృత్యాలను పరిశీలించారు. విద్యలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సేవలు మార్పునకు దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి లలితకుమారి, సీడీపీవోలు జైరామ్‌నాయక్, చంద్రకళ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



సంగారెడ్డి కలెక్టరేట్: కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీసీ, దళిత సంఘాల నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 23: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన దేశానికి క్షమాపణ చెప్పాలన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం బహుజన సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచం గర్వించదగిన మేధావి అన్నారు. అమీత్‌షాపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగం మీద జరిగిన చర్చకు జవాబుగా నిండు సభలో రాజ్యాంగం, అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని పేర్కొన్నారు. వెంటనే మంత్రి పదవి నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రామారావు, దళిత, గిరిజన, బీసీ సంఘాల నాయకులు అశోక్, దుర్గాప్రసాద్, జైపాల్ నాయక్, పవన్, శ్రీకాంత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

పుల్కల్, డిసెంబర్ 23: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు మండల పరిధిలోని బస్వాపూర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తలారి అంజయ్య, పోచయ్య, శ్రీనివాస్, మధుసుదన్, శ్యామ్‌సుందర్, కరుణాకర్, రజని, శ్రీకాంత్, వినయ్, మధు, నిఖిల్, నిరంజన్ పాల్గొన్నారు.

మెదక్ చర్చికి ప్రత్యేక బస్సు సర్వీసులు

జహీరాబాద్, డిసెంబర్ 23: క్రిస్మస్ సందర్భంగా మెదక్ పట్టణంలోని చర్చికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం జహీరాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. డిపో నుంచి మధ్యాహ్నం 1, 2, 3 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. తిరిగి మెదక్ నుంచి సాయంత్రం 5, 6, 7 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదాన సత్రానికి స్టీల్ ప్లేట్లు అందజేత

ప్లేట్లు అందజేస్తున్న దాతలు

ఝరాసంగం, డిసెంబర్ 23: ప్రముఖ పుణ్యక్షేత్రం ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ అన్నదాన సత్రానికి సోమవారం జహీరాబాద్‌కు చెందిన సీసీ జ్యోషి స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఆలయ ఈవో శివరుద్రప్ప వారిని శాలువాతో సత్కరించారు. అర్చకులు దిలీప్‌జ్యోషి, ఆలయ సిబ్బంది సంగయ్య స్వామి, చంద్రకాంత్, రాజేశ్వర్, నర్సింహులు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

నాగల్‌గిద్ద, డిసెంబర్ 23: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన తేజుబాయి(45) ఇంటిలో పని చేస్తుండగా పాముకాటు వేసింది. వెంటనే చికిత్స నిమిత్తం కరస్‌గుత్తి ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రం బీదర్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందింది. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సరిగ్గా చేపట్టకపోవడంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రాపురం, డిసెంబర్ 23: బీహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారికి కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 50 శాతం ఉండాలని తెలిపారు. నెట్, సెట్ పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. రాజనీతిశాస్త్రం1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ సబ్జెక్ట్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులను జనవరి 2న సాయంత్రం 4 గంటల వరకు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. జనవరి 3న అభ్యర్థులకు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

గీతం పాలకమండలి సభ్యుల ఎంపిక

పటాన్‌చెరు, డిసెంబర్ 23: గీతం పాలకమండలి సభ్యులుగా ఇద్దరు మహిళా ప్రముఖులు చేరారు. సోమవారం గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(గీతం) పాలకమండలి (గవర్నింగ్ బాడీ) సభ్యులుగా ఇద్దరు ప్రముఖ మహిళా నాయకులు జస్టిస్ విజయలక్ష్మి, పద్మజ చుండూరు చేరినట్టు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. జస్టిస్ విజయలక్ష్మి ప్రముఖ న్యాయమూర్తిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన అనుభవం ఉంది. పద్మజ చుండూరు ఫైనాన్షియల్ సర్వీసెస్ నిపుణురాలు. మన దేశంతోపాటు అమెరికాలో ఆర్థిక సేవా రంగంలో 37 ఏండ్ల అనుభవం ఉన్నాదని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది: 23-12-2024

ఇందుమూలముగా సమస్త ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు శ్రీమతి కీర్ పింకి భర్త కీ.శే. రవికిరణ్, మరియు నా ఇద్దరు కుమారులు 1) కీర్ కనిష్క్ తండ్రి రవి కిరణ్, 2) కీర్ కార్తిక్ తండ్రి రవి కిరణ్, అందరి నివాసము: ఇ.నెం. 14-51, శ్రీనివాసనగర్ కాలనీ, రామచంద్రాపురం గ్రామం మరియు మండలం, సంగారెడ్డి జిల్లా గారు తెలియపర్చునది ఏమనగా నా భర్త కీర్ రవి కిరణ్ గారు తేది: 05.12.2022 నాడు అనారోగ్యముతో మృతి చెందినాడు, నా భర్త జీవించియున్న కాలంలో బీరంగూడ గ్రామము, అమీన్పూర్ మండలం, సంగారెడ్డి జిల్లాలో 1) ప్లాట్ నెం. 26 విస్తీర్ణము 166.66 గజాలు 2) ప్లాట్ నెం.27 విస్తీర్ణము 166.66 గజాలు, 3) సర్వే నం. 948, 949, 951, 952, 953, 954 మరియు రామచంద్రాపురం 1) ఇంటి నెం. 14-51, ఎ.సి.సి. రేకుల షీట్స్ విస్తీర్ణము 50 గజాలు, 2) ఇంటి నెం. 14-51, ఎ.సి.సి. రేకుల షీట్స్ విస్తీర్ణము 50 గజాలు, మరియు 3) ఇంటి నెం. 14-51, ఎ.సి.సి. రేకుల షీట్స్ విస్తీర్ణము 100 గజాలు ఆర్.సి.సి రూఫ్ కవర్స్ గలవి, శ్రీనివాసనగర్ కాలనీ/ రామచంద్రాపురం గ్రామం మరియు మండలం, సంగారెడ్డి జిల్లాలో ఉన్నవి నా భర్త కీ.శే. కీర్ రవికిరణ్ గారు జీవించి ఉన్న కాలంలో కొనుగోలు చేసినాడు అట్టి ఆస్తుల పైన ఎవరికి ఏమైన ఆక్షేపణలు గాని అభ్యంతరాలు గాని ఉన్న యెడల మేము కీర్ పింకి మరియు నా వారసులము సంగారెడ్డి జిల్లా 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, సంగారెడ్డి ఓ.యస్. నెం. 162/2024 కేసు వేయడమైనది. కావున ఇట్టి ఆస్తులపై ఎవరికి ఏమైన అభ్యంతరాలు, లావాదేవీలు, మరియు వారసులు ఎవరైనా ఉన్న యెడల అట్టి వారు కోర్టును సంప్రదించి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు అని బహిరంగ ప్రకటన చేయుచున్నాము.

సం/- యం. విజయ్ రాజ్
న్యాయవాది,
విల్లా నెం. 116, సింఫని పార్క్ హోమ్స్ కాలనీ,
పటాన్చెరు టౌన్, సంగారెడ్డి జిల్లా.
ఫోన్ నం.: 7207771008